- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
07-04-2026

సంపుటి : 01 సంచిక :16 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE :16 NAMASTEY MAHAAPRABHA

## కాంగ్రెస్ పార్టీకి పాకిస్థాన్‌తో దోస్తీ



### 'కాంగ్రెస్ గెలవాలని పాక్ కోరుకుంటోంది'

- పాక్ స్క్రిప్ట్‌తోనే ప్రతిపక్షాల ప్రెస్ మీట్లు
- ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పాటే పాడింది
- అస్సాం గడ్డపై మోదీ సంచలన ఆరోపణలు:
- అస్సాం ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6( మహా ప్రభ )

కాంగ్రెస్ పార్టీ కి పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం అస్సాంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మోదీ.. దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పాటే పాడిందని -మిగతా 3 లో



## ఫుడ్‌సేఫ్టీ కోసం ప్రత్యేక వ్యవస్థ

- రంగంలోకి 24 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు
- ఐదు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ వాహనాలు
- రూ.15 కోట్లతో 3 కొత్త రీజినల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా

హైదరాబాద్ ఏప్రిల్ 6( మహా ప్రభ )

డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టుగా, ఫుడ్ సేఫ్టీ కోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సంకల్పించారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా తెలిపారు. శాస్త్రీయ అధ్యయనం అనంతరం, త్వరలోనే ఒక కొత్త వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చి.. ఆహార కల్తీ కేటుగాళ్లపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. -మిగతా 3 లో



## కోహెడ భూములపై కన్నేశారా?

- రూ.3 వేల కోట్ల స్థల విక్రయానికి యత్నం
- ప్రభుత్వం వెనక్కి తగ్గాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

తుర్కయంజాల్ ఏప్రిల్ 6( మహా ప్రభ )

కోహెడ ఫ్రూట్ మార్కెట్‌కు కేటాయించిన సుమారు రూ.3 వేల కోట్ల విలువైన సుమారు 200 ఎకరాల భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ కోహెడ మార్కెట్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అంత ర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్ నిర్మాణానికి రూ.1000 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం టెండర్లు పిలవకుండా భూముల విక్రయానికి ప్రయత్నించడం అన్యాయమని అన్నారు. కొద్దిమంది దళారుల ప్రయోజనాల కోసం లక్షలాది మంది రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ సమీపంలోని విలువైన భూములను విక్రయించి, ఇతర ప్రాంతాలకు మార్కెట్‌ను మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. -మిగతా 3 లో



## ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

- ఇనుప గేటును ధ్వంసం చేస్తూ దూసుకెళ్లిన కారు
- కారు సీజ్..నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ ఏప్రిల్ 6( మహా ప్రభ )

ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ అసెంబ్లీ గేటును ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లాడు. అనంతరం స్పీకర్ విజయేందర్ గుప్తా కార్యాలయం బయట పుష్పగుచ్ఛం ఉంచి, కారుపై సిరా విసిరి..అదే కారులో పరారయ్యాడు. వాహనానికి ఉత్తర్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ ప్లేటు ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. వాహనం కోసం గాలింపు చర్యలు ప్రారంభించిన ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఫోరెన్సిక్ బృందంతో పాటు బాంబు స్క్వాడ్ అసెంబ్లీలో తనిఖీలు చేపట్టాయి. పుష్పగుచ్ఛంలో ఏమీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. -మిగతా 3 లో



## వర్షం కారణంగా కేకేఆర్, పీబీకేఎస్ మ్యాచ్ రద్దు

- ఐపీఎల్ 2026లో తొలి 'వాష్ అవుట్'
- 3.4 ఓవర్లకే ముగిసిన ఆట..
- ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6( మహా ప్రభ )

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో తొలిసారిగా ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది. సోమవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచుకు వర్షం అంతరాయం ఏర్పడింది. కేకేఆర్ బ్యాటింగ్ చేస్తుండగా 3.4 ఓవర్లలో 25/2 పరుగులు వద్ద వర్షం అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత వాన మళ్లీ తగ్గలేదు. దీంతో అంపైర్లు మ్యాచును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ఈ మ్యాచులో తొలుత టాస్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఇన్నింగ్స్ 3.4 ఓవర్ల వద్ద వర్షం ఎంట్రీ ఇచ్చింది. దీంతో ఇరు జట్ల ఆటగాళ్లు మైదానాన్ని వీడారు. -మిగతా 3 లో

## హామీలు నెరవేరుస్తున్నాం



### మేం పాలకులం కాదు.. ప్రజా సేవకులం

- ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే : పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి ఏప్రిల్ 6( మహా ప్రభ )

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురావడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం చేయించారు. అనంతరం రూ.1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం -మిగతా 3 లో

ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం





## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష..

- తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులోమదురై కోర్టు సంచలన తీర్పు

మదురై: ఏప్రిల్ 6( మహా ప్రభ )

తండ్రీ కొడుకుల లాకప్ డెత్ కేసులో తొమ్మిది మంది పోలీసులకు ఉరిశిక్ష విధిస్తూ తమిళనాడులోని మదురై మొదటి తరగతి జిల్లా, సెషన్స్ కోర్టు సోమవారం సంచలన తీర్పు చెప్పింది. అలాగే వారికి రూ.కోటి జరిమానా విధించింది. బాధిత కుటుంబానికి ఆ మొత్తం చెల్లించాలని ఆదేశించింది. కొవిడ్ సమయంలో తమ దుకాణాన్ని తెరచి ఉంచారన్న ఆరోపణలపై జయరాజ్, అతని కుమారుడు బెనిక్స్‌ను తుత్తుకూడి జిల్లా సాతన్‌కుళం పోలీసులు 2020 జూన్ 19న స్టేషన్‌కు తీసుకు వచ్చారు.ఆ రోజు రాత్రంతా వారిని చితకబాది మరునాడు కోవిపట్టి సబ్‌జైల్‌కు తరలించారు. తీవ్ర గాయాలతో కోవిపట్టి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ బెనిక్స్ జూన్ 22న మరణించగా, అతని తండ్రి జయరాజ్ ఆ మరునాడు కన్నుమూశాడు.

-మిగతా 3 లో

## పాములు, మొసళ్లతో సరిహద్దు కాపలా!..



### అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు బీఎస్ఎఫ్ యోచన


న్యూఢిల్లీ, ఏప్రిల్ 6( మహా ప్రభ )

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో చొరబాటుదారులను నిరోధించడానికి పాములు, మొసళ్లను వినియోగించాలని సరిహద్దు భద్రతా దళ (బీఎస్ఎఫ్) వర్గాలు యోచిస్తున్నాయి. నదీతీర, చిత్తడి నేలల్లో చొరబాట్లను నిరోధించడానికి ఒక సహజ నిరోధంగా వీటిని వినియోగించాలని ఈ యోచన చేస్తున్నారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో సంప్రదాయ ఫెన్సింగ్ వేయడానికి వీలుకాకుండా బలహీనమైన ప్రదేశాలు ఉన్నచోట వీటిని ఉంచాలని భావిస్తున్నారు. కాగా, 4,096 కి.మీ పొడవున ఉన్న సరిహద్దులో 175 కి.మీలు నదీతీర, చిత్తడి నేల ప్రాంతాలు -మిగతా 3 లో

## తాత్కాలిక సంధికి నో!

### యుద్ధానికి శాశ్వత ముగింపు కావాలి

- ట్రంప్ కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరించిన ఇరాన్
- యుద్ధం ముగింపునకు 10 డిమాండ్లు
- పాకిస్థాన్ ద్వారా అమెరికాకు చేరవేత
- ఇరాన్ నిర్ణయంపై ట్రంప్ అసంతృప్తి
- భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- ఒక్క రాత్రిలో ఇరాన్ మొత్తాన్ని నాశనం చేస్తామని వార్నింగ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6( మహా ప్రభ )

అమెరికా నుంచి వచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ సోమవారం తిరస్కరించింది. తన ప్రతిస్పందనను పాకిస్థాన్ ద్వారా అమెరికాకు తెలియచేసినట్లు ఇరాన్ అధికారిక వార్తాసంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ(ఇర్నా) తెలిపింది. తాత్కాలిక ఒప్పందానికి ఇరాన్ ఇష్టపడడం లేదని, యుద్ధానికి శాశ్వత ముగింపు అవసరమని -మిగతా 3 లో

## చందమామ చెంతకు ఆర్టెమిస్-2



- నేడు తిరుగు ప్రయాణం..
- 10న ల్యాండింగ్

3

# దుబ్బాక పెద్ద చెరువులోకి " కాళేశ్వరం "సాగునీరు...!

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



**దుబ్బాక – ఏప్రిల్ 6 (మహాప్రభ)**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సాగునీరు సోమవారం దుబ్బాక పెద్ద చెరువులోకి చేరాయి. దుబ్బాక పెద్ద చెరువులో చేరడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. మాజీ సీఎం కేసీఆర్ మాజీ నీటి పారుదల శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు , ఇప్పుడు నన్ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ల కలవరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక పెద్ద చెరువులోకి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రికి , దుబ్బాక ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆస సులోచన స్వామి, కౌన్సిలర్లు బండి రాజు, చాంద్ మియా, దేవుని రాజు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లిలో ఎంపీవో పర్యటన
### గ్రామాభివృద్ధిపై సమీక్ష, గ్రంథాలయ ప్రాధాన్యతపై సూచనలు



**శివంపేట, ఏప్రిల్ 6(మహాప్రభ):**
శివంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో ఎంపీవో తిరుపతి రెడ్డి పర్యటించి, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రంథాలయాల అభివృద్ధి అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. సర్పంచ్ పెంజర్ల మమత నరసింహా యాదవ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలతో కలిసి సమావేశం నిర్వహించిన ఎంపీవో, గ్రామంలో విద్యా వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.
గ్రామాల్లో విద్యా సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా యువతకు మంచి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ ప్రతినిధులు తమ సమస్యలు, అభిప్రాయాలను ఎంపీవో దృష్టికి తీసుకువచ్చారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ.

-నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ
-సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక.

**మెదక్ జిల్లా -06ఏప్రిల్ (మహాప్రభ )**



జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక గారు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూటినీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

## కరీంనగర్‌లో నీటి గోసపై రవీందర్ సింగ్ ఆగ్రహం

**కరీంనగర్, 06 ఏప్రిల్ మహాప్రభ**



నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, పాలకుల అసమర్థత వల్ల ప్రజలు చుక్క నీటి కోసం అల్లాడుతున్నారని మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఆయన మున్సిపల్ ఫిల్టర్ బెడ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ నెలకొన్న అపరిశుభ్రత, నిర్వహణ లోపాలపై అధికారులను నిలదీశారు.డ్యామ్‌లో 7.5 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ ప్రజలకు రెండు రోజులకు ఒకసారి కేవలం 20 నిమిషాలే నీటిని వదులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్చకపోవడం వల్ల కలుషిత నీరు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు.ప్రతిరోజూ ఇంటింటికీ నీరు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రమంత్రి బండి సంజయ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. అమృత్ పథకం నిధులు ఏమయ్యాయని నిలదీశారు.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రవీందర్ సింగ్ హెచ్చరించారు.

# కార్మిక ఉద్యమ నేతకు ఘన నివాళ్లు

**దుబ్బాక – ఏప్రిల్ 06 (మహాప్రభ)**
సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షుడు బి,టీ రణదేవి గారి 32వ వర్ధంతి సందర్భంగా సోమవారం దుబ్బాకలో సిఐటియు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి జి,భాస్కర్ మాట్లాడుతూ..... బి,టీ
రణదివె ఆసామాన్య పోరాటం, బ్రిటిష్ కు వ్యతిరేకంగా జరిగిన స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారని బ్రిటిష్ కాలంలోనే బొంబాయిలో కార్మిక సంఘాలు స్థాపించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. భారతదేశంలో మొట్టమొదటి అఖిల భారత ట్రేడ్ యూనియన్ జాతీయ నాయకుడిగా 1970లో ఏర్పడిన నాటి నుండి 1991 వరకు సిఐటియు కు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. కార్మికుల ప్రయోజనాలే తప్ప సొంత జీవితం పట్ల ఆసక్తి లేని నిస్వార్థ నేతని కొనియాడారు. కార్మికోద్యమం పట్ల తన నిబద్ధతకు. క్రమశిక్షణకు మారుపేరు అన్నారు. నిరాడంబరంగా



ఉండటం ఆయనకు ఉన్న మరో ఉత్తమ లక్షణం. సౌకర్యాలకు అలవాటు పడితే సోమరిగా మారి, విప్లవ బాధ్యతలు నెరవేర్చలేమని ఆయన చెప్పే వారన్నారు. బి, టి,ఆర్ మహా ధైర్యశాలి, తన జీవితాంతం కార్మిక వర్గ ఐక్యత కోసం కృషి చేశారని కార్మిక వర్గం ఐక్యంగా ఉండాలని ప్రయత్నించారని తెలిపారు. 19 74 లో రైల్వే కార్మికులను ఐక్యం చేసి, రైల్వే కార్మికుల పోరాటంలో ప్రధాన పాత్ర పోషించారని , కార్మిక , కర్షక ఐక్యత కోసం బి టి ఆర్ అనలేని కృషి చేశారన్నారని తెలిపారు. కేంద్రం బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా విధానలతో 29 రకాల కార్మిక చట్టాల రద్దుచేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోట్లు తీసుకువచ్చి కార్మికులను తట్టు బానిసలుగా చేస్తూ మోసం చేస్తుందని విమర్శించారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం విధానాల వలన కార్పొరేట్లు ఆస్తులు ఇబ్బందిగా ముబ్బడిగా పోగుపడుతున్నయని మరోపక్క ఆకలి, పేదరికం , ఆకలి చావులు, రైతాంగ ఆత్మహత్యలు నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఈ నేపథ్యంలో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య కార్మికు ఉద్యమాన్ని నిర్మించడమే బి టి ఆర్ మనం అర్పించే నిజమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, ఎల్లారం రవీందర్, కృష్ణారి, చెట్టు శ్రీనివాస్ సాజిద్ కంపెనీ ఎల్లయ్య, ఎండి సాదిక్, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 10 నుంచి ధాన్యం
# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

-మొత్తం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు 518 ఏర్పాటు
-జిల్లా అదనపు కలెక్టర్.

**మెదక్ జిల్లా -06ఏప్రిల్ (మహాప్రభ )**
ఏప్రిల్ 10 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెద్ద ఎత్తున ప్రారంభించాలని,జిల్లా వ్యాప్తంగా 518 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.
సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లై అధికారులు, ట్రాన్స్ పోర్ట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు, రైస్ మిల్లర్ల యాజమాన్లలతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్




మాట్లాడుతూ.. జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, ధాన్యం కొనుగోలు సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గన్ని బ్యాగులు, తూకం, తార్పాలిన్ కవర్లు, మొదలగు సామాగ్రి అందుబాటులో ఉండాలన్నారు. రైస్ మిల్లు యజమానులు హమాలీని, రవాణా వాహనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైస్ మిల్లులో అన్లోడింగ్ ప్రక్రియ త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైస్ మిల్లర్ యజమాన్యాలకు సూచించారు. యాసంగి సీజన్ సిఎంఆర్ ను కూడా త్వరగా చేయాలని సూచించారు. తూనికల కొలతల అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, రైస్ మిల్లుల్లో ధాన్యం తూకం కొలతలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ఫీల్డ్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా కోపరేటివ్ అధికారి కరుణాకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, రైస్ మిల్లు యాజమాన్యాలు, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి రీ సర్వే చేపట్టాలని డిమాండ్



**పాలకుర్తి, 06 ఏప్రిల్ మహాప్రభ**
పాలకుర్తి మండలం కన్నాల గ్రామం వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం వలన రైతులు భూములు, ఇండ్లను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం సమర్పించి రీ సర్వే చేపట్టి ఎలాంటి నష్టం వాటిల్లకుండా బ్రిడ్జి నిర్మించాలని రైతులు కోరారు.ఎన్నో ఏళ్లుగా ఇక్కడ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి లేక ప్రయాణికులు గేటు పడితే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, ప్రజాప్రతినిధుల ఒత్తిడితో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్రం వద్ద అనుమతులు తీసుకువచ్చారని, ప్రస్తుతం సర్వే ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. అయితే ఈ నిర్మాణం వలన కొందరు రైతులు తమ భూములు, ఇండ్లను పూర్తిగా కోల్పోతున్నారని, సంతకాలు సేకరించి రీ సర్వే చేసి నష్టం లేకుండా బ్రిడ్జి నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ అవగాహన సదస్సు

**హుస్నాబాద్,**
**06 ఏప్రిల్ మహాప్రభ**



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వర్లు వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమాలను పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10,000 జరిమానా విధించబడుతుందని, తలకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని, లైసెన్స్ లేని వారు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని చెప్పారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## రేకుర్తి-విద్యానగర్ 22/ఏ భూ బాధితుల కీలక సమావేశం



**కరీంనగర్, 06 ఏప్రిల్ మహాప్రభ**
శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలోని గిరి హోటల్‌లో రేకుర్తి మరియు విద్యానగర్ 22/ఏ భూ బాధితుల సమావేశం జరిగింది. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశానికి సుమారు 80 మంది భూ బాధితులు హాజరై తమ సమస్యలను, అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు చూపిన స్పందన, అధికారుల తీరుపై విస్తృతంగా చర్చించారు. గతంలో చేపట్టిన ఆందోళనలు, వినతిపత్రాల ఫలితాలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఉధృతం చేయాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఐక్యవేదిక కన్వీనర్ పాశం మోహన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్, పచ్చునూరి నరేందర్, అందె శ్యాం సుందర్, ఆకుల కృష్ణ, రవి, వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, రమణా రెడ్డి, రాగి రఘునందన్ తో పాటు రేకుర్తి మరియు విద్యానగర్ భూ బాధితులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన హిందూ సమ్మేళనం ప్రచార రథయాత్ర

**కరీంనగర్, 06 ఏప్రిల్ మహాప్రభ**



కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం నుండి హిందూ సమ్మేళనం ప్రచార రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. మంగళవాయిద్యాల మధ్య, కరతాళ ధ్వనులతో రథాన్ని ప్రముఖులు, భక్తులు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ, ఐక్యత కోసం రండి కదిలిరండి అంటూ పిలుపునిచ్చారు. స్థానిక నాయకులు, ఆధ్యాత్మిక వేత్తలు ప్రసంగించి హిందూ బంధువులంతా ఈ ఆత్మీయ ఆహ్వానాన్ని మన్నించి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాషాయ జెండాలతో అలంకరించిన రథం స్థానిక వీధుల్లో తిరుగుతూ ప్రజలకు కార్యక్రమ వివరాలను తెలియజేస్తోంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# వర్షం కారణంగా కేకేఆర్, పీబీకేఎస్ మ్యాచ్ రద్దు

మొదటి తరువాయి



అప్పటికి జట్టు స్కోరు 25/2గా ఉంది. ఫిన్ అలెన్ (6), కామెరూన్ గ్రీన్ (4) పెవిలియన్ చేరారు. క్రీజులో కెప్టెన్ అజింక్య రహానే (8), ఎ.రఘువంశీ (7) ఉన్నారు.తొలుత చిన్నగా ప్రారంభమైన వాన ఎంతకీ తగ్గలేదు. ఇదే సమయంలో బలమైన గాలులు సైతం వీయడంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం అయ్యారు. చాలా సేపటి తర్వాత వర్షం తగ్గింది. కానీ ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. కనీసం ఐదు ఓవర్ల ఆట అయినా ఆడించేందుకు అంపైర్లు ప్రయత్నించారు. కానీ అది కూడా సాధ్యం కాలేదు. దీంతో చివరకు చేసేదేంలేక అంపైర్లు మ్యాచును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్ల కెప్టెన్‌లతో మాట్లాడిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ ఫలితంతో ఇరు జట్ల ఖాతాలో చెరో పాయింట్ చేరింది. ఐపీఎల్ 2026లో వర్షం కారణంగా రద్దు అయిన తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఈ ఫలితంతో పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరింది. ఆ జట్టు ఖాతాలో ఐదు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ తమకు దక్కిన తొలి పాయింట్‌తో పాయింట్ల ఖాతాను తెరించింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్స్ టేబుల్‌లో 8వ ప్లేసులో ఉంది.

## ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

మొదటి తరువాయి

ఇటీవల ముగిసిన బడ్జెట్ సమావేశాల వేళ ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో తాజా ఘటన చోటుచేసుకోవడం భద్రతా వైఫల్యాన్ని సూచిస్తోంది. భద్రతా లోపంగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నామని ఢిల్లీ అసెంబ్లీ వర్గాలు పేర్కొన్నాయి.

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష..

మొదటి తరువాయి

దీంతో కేసు విచారించిన జడ్జి జీ ముత్తుకుమారన్ అప్పటి స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను నిందితులుగా పేర్కొంటూ వారికి మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు

## పాములు, మొసళ్లతో సరిహద్దు కాపలా!..

మొదటి తరువాయి

ఉన్నాయి.ఇక్కడ భౌతికపరమైన అడ్డంకులు ఏర్పాటు చేయడం వల్ల స్మగ్లింగ్, ఇతర అక్రమ కార్యకలాపాలు, చొరబాట్లను నిరోధించడం చాలా కష్టతరం. కాగా, కొత్త ప్రణాళికకు అనుకూలంగా ఉన్న నదీతీర ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని బీఎస్ఎఫ్‌ను ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే ఈ ప్రణాళిక ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని, భవిష్యత్‌లో దీనిని అమలు చేస్తారో లేదో తెలియదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. కాగా, అదే సమయంలో డ్రోన్లు, సెన్సార్లు, కెమెరాలు, ఇతర రక్షణ వ్యవస్థలతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ నిఘాను పటిష్టం చేసినట్టు ఆయన చెప్పారు.

## చందమామ చెంతకు ఆర్టెమిస్-2..

- నేడు తిరుగు ప్రయాణం..
- 10న ల్యాండింగ్



**న్యూఢిల్లీ**

దాదాపు 53 ఏండ్ల తరువాత మానవులు మరోసారి జాబిల్లి చెంతకు చేరారు. గత అర్ధశతాబ్ద కాలంలో అంతరిక్షంలోకి అడుగుపెట్టిన ప్రతి మానవుడూ విశ్వపు ఉపరితలాన్ని స్పృశించి వచ్చాడు తప్ప, అది దాటి అవతలికి వెళ్లలేదు. కానీ అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్రలో నలుగురు వ్యోమగాములు చంద్రుడి సమీపానికి చేరారు. వారిని తీసుకెళ్లిన ఓరియన్ వ్యోమనౌక ఈ నెల 6న 4,06,773 కిలోమీటర్లు ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది.ఇంతకుముందు 1970లో అపోలో 13 నెలకొల్పిన రికార్డు కంటే ఇది 2,500 కిలోమీటర్లు అదనం. వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం ఈ నెల 7న అర్ధరాత్రి 12:15కు చంద్రుడి సమీపం నుంచి తిరుగు ప్రయాణం కానున్నది. ప్రస్తుతం అంతరిక్షంలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) భూకక్ష్యలో 400 కిలోమీటర్ల దూరంలో ఉండగా, చంద్రుడు భూమికి 3,84,633 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. ఇంతకుముందు అపోలో-13 4,00,171 కిలోమీటర్ల దూరం ప్రయాణించగా, ఆర్టెమిస్-2 మరో 2,500 కిలోమీటర్ల దూరం ఎక్కువగా ప్రయాణించనుంది. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తిచేశాక వ్యోమనౌక ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ కావచ్చు.

# హామీలు నెరవేరుస్తున్నాం

మొదటి తరువాయి

పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు.



రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ.5,400 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తాత్కాలిక సంధికి నో!

మొదటి తరువాయి

స్పష్టం చేస్తున్నట్లు ఇరాన్ స్పందన తెలియచేస్తున్నది. ఇరాన్ తన సమాధానంలో తక్షణ కాల్పుల విరమణతోపాటు 10 నిబంధనల ప్రణాళికను పొందుపరిచింది. ఇందులో పశ్చిమాసియా ప్రాంతమంతటా ఘర్షణలను అంతం చేయడం, హొర్ముజ్ జలసంధి గుండా సురక్షిత ప్రయాణానికి భరోసా ఇచ్చే నిబంధనలు అమలుచేయడం, ఇరాన్ పునర్నిర్మాణానికి సంబంధించిన ఆంక్షలు, నిబంధనలు ఎత్తివేయడం వంటి డిమాండ్లు ఉన్నాయి. తాము కేవలం కాల్పుల విరమణను మాత్రమే ఆమోదించబోమని కైరోలోని ఇరాన్ దౌత్య కార్యాలయ అధిపతి మొజ్తబా ఫిర్దౌసీ పోర్ సోమవారం అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు. ఇరాన్‌పై మళ్లీ దాడి జరగదన్న హామీలతో కూడిన యుద్ధ ముగింపును తాము ఆమోదిస్తామని ఆయన స్పష్టం చేశారు. గడువులోగా ఒప్పందానికి అంగీకరించకపోతే ఇంధన, మౌలిక సదుపాయాలను బాంబులతో పేల్చివేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన వెలువడింది. కాగా, పాకిస్థాన్ బలపరుస్తున్న కాల్పుల విరమణ ప్రతిపాదన తమ పరిశీలనలో ఉన్న అనేక ఆలోచనలలో ఒకటని వైట్ హౌస్ అధికారి ఒకరు సోమవారం సీబీఎస్ న్యూస్‌కు తెలిపారు. అయితే అధ్యక్షుడు ట్రంప్ దీనికి ఆమోదం తెలపలేదని, ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో



సమాచార మార్పిడి మార్గాలను తెరచి ఉంచడానికి పాకిస్థాన్ తెరవెనుక నుండి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నది. పాకిస్థాన్‌తోపాటు ఈజిప్టు, తుర్కియే కూడా ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య ప్రత్యక్ష సందేశాల మార్పిడికి దోహదపడుతున్నాయి.

**భారీ మూల్యం తప్పదు: ట్రంప్**

తన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వెంటనే స్పందించారు. ఇరాన్ స్పందనతో తాను చాలా కలత చెందానని ఆయన తెలిపారు. ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో విఫలమైన పక్షంలో ఇరాన్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరిస్తూ తాను విధించిన గడువు సమీపిస్తున్న వేళ తను తీసుకునే వైఖరి ఎంత కఠినంగా ఉండగలదో ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్‌కు విధించిన మంగళవారం గడువులో ఎటువంటి మార్పు ఉండబోదని, అదే ఫైనల్ అని ట్రంప్ స్పష్టం చేశారు. వారు చేయాల్సింది చేస్తే ఇది(యుద్ధం) చాలా త్వరగా ముగిసిపోవచ్చు అని ఇరాన్‌ని ఉద్దేశించి ట్రంప్ చెప్పారు. వారు కొన్ని పనులు చేయాల్సిందే. ఆ విషయం వారికి తెలుసు. మొదటి, రెండవ దశలలో ఉన్న ఉన్మాదులతో పోలిస్తే అక్కడి ప్రజలు చాలా తెలివైనవారు అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

---

## కాంగ్రెస్ పార్టీకి పాకిస్థాన్‌తో దోస్తీ

మొదటి తరువాయి

ఆరోపించారు.కాంగ్రెస్, పాకిస్థాన్ సంబంధం ఇప్పటిది కాదని, ఎప్పటి నుంచో సాగుతున్నదని, ఇది జాతీయ భద్రతకు చాలా ప్రమాదకరమని ప్రధాని వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలో పవన్ ఖేరా, గువాహటిలో గౌరవ్ గొగోయ్ రెండు వేర్వేరు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఆ కాన్ఫరెన్స్‌కి సంబంధించిన మొత్తం సమాచారాన్ని పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్టు తాము గుర్తించామని విమర్శించారు. అస్సాం ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలను నిర్వహించిందని, ఇలా ఇంతకు ముందెప్పుడూ జరగలేదని, ప్రతి షోలోనూ చివరకు కాంగ్రెస్ గెలవాలని చెప్పారని ప్రధాని తెలిపారు. ఆదివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో పాకిస్థాన్ జోక్యం స్పష్టంగా వెల్లడైందని అన్నారు. ఇదిలావుంటే అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ సతీమణి రిణికి భూయాన్ శర్మకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దాంతోపాటు ఆమె ఆస్తులను ఆయన అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు కేసు నమోదు చేయొచ్చని, ఎన్నికల సమయంలో ప్రజలను ప్రభావితం చేసేందుకే ఇలాంటి విమర్శలు చేశారని హిమాంత కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు.ం

## కోహెడ భూములపై కన్నేశారా?

మొదటి తరువాయి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి భూముల వ్యవహారాలపైనే దృష్టి సారించిందని విమర్శించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కోహెడ భూముల విక్రయాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, మార్కెట్ అభివృద్ధి వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేశ్, వంగేటి లక్ష్మారెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, సత్తు వెంకట రమణారెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, దండెం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్‌సేఫ్టీ కోసం ప్రత్యేక వ్యవస్థ

మొదటి తరువాయి

హైదరాబాద్ జలవిహార్ నుంచి మొదలైన ఫుడ్ సేఫ్టీ అవేర్‌నెస్ వాకథాన్‌ను సోమవారం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాకథాన్ జలవిహార్ నుంచి ఐమ్యాక్స్ పక్కనున్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వరకూ కొనసాగింది.




ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొన్నేండ్లుగా మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, బిజీ లైఫ్ స్టైల్, పెరుగుతున్న అర్బనైజేషన్ వల్ల ఇంట్లో వంట చేసుకోవడం తగ్గిపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లలో తినడం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం విపరీతంగా పెరిగిందన్నారు. ఈ డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో ఫుడ్ ఇండస్ట్రీ కూడా వేగంగా విస్తరించిందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చిన్నవి, పెద్దవి అన్నీ కలిపి సుమారు 1.41 లక్షల ఫుడ్ బిజినెస్ సంస్థలు ఉన్నాయని తెలిపారు. వీటిలో దాదాపు 80 శాతం పట్టణ ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉండటం, నగరాల్లో రెడీ టు ఈట్, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలకు ఉన్న అధిక డిమాండ్‌ను స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. ఈ పరిస్థితిని కొంతమంది దుర్వినియోగం చేస్తూ ఆహారాల్లో కల్తీకి పాల్పడుతున్నారన్నారు. ఉప్పు, పప్పులు, చింతపండు, చక్కెర, టీ పొడి ఇలా దేన్నీ వదలడం లేదని తెలిపారు. మరోవైపు నాసిరకం నూనెలు, నాణ్యత లేని పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నారని, కల్తీ, నాసిరకం ఆహారం వినియోగం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని చెప్పారు. దీర్ఘకాలంలో మధుమేహం, రక్తపోటు, గుండె, మూత్రపిండాల వ్యాధులు, అధిక బరువు వంటి సమస్యలకు కూడా కల్తీ, నాసిరకం ఆహారం కారణమవుతోందని డాక్టర్లు చెబుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ అంతటా నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల భారం పెరుగుతుండటానికి అనారోగ్యకర ఆహార అలవాట్లు ఒక ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

# సంపాదకీయం

## సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే !



పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ధ విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతబడిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సివస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండాకాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించాలి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజవాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సిపిఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యస్థ కూడా బలపడుతుంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పొరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడ రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా-గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్ల ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజవాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధరరూ.300- 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం. కెజి బేసిన్‌లో చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అవసరమైతే అసెంబ్లీ తీర్మానించాలి. ఈ విషయంలో అఖిలపక్షంలో చర్చించాలి. గతంలోకి వెళితే కృష్ణా-గోదావరి డి6 బేసిన్ ను రిలయన్స్ ఇండిస్ట్రీస్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధం గా కేటాయించాయి. భూగర్భ నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ విషయాన్ని గురించి పెట్రోలియం మంత్రిత్వ శాఖను నిలదీసింది. కనుక ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్ సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. దీనిని చంద్రబాబు లేవనెత్తడం మంచిది. కేంద్రంలో అధికారం పంచుకుంటున్న చంద్రబాబు ఈ విషయంలో ఇప్పటికైనా డిమాండ్ ముందుకు తీసుకుని రావాలి. రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఎలాగూ ఇవ్వడం లేదు. విభజన సమస్యలు అలాగే ఉన్నాయి. అయితే చంద్రబాబు కోరిన వెంటనే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. అందువల్ల సహజ వాయువు విషయంలో ఒత్తిడి పెంచితే కేంద్రం దిగిరాక తప్పదు. ప్రజలు కూడా ఆందోళనలకు దిగితే తప్ప రాష్ట్రానికి చురుకు పుట్టదు.

# కోర్టు తీర్పు 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు

### సామాజికవేత్త శ్రీనివాస్ గౌడ్



**దేవరకొండ ఏప్రిల్ 6( మహా ప్రభ )** విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని హై కోర్టు అనడం పేద విద్యార్థులకు అన్యాయం సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రెస్మీట్ ఏర్పాటు చేయబడినది. ఈ సందర్భంగా ఎంపీ రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు సమావేశం ఏర్పాటు చేయబడినది .ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం చాలా అన్యాయమని, 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు అని, ఇది ప్రభుత్వ అసమర్థత, హైకోర్టులో అడ్వకేట్ జనరల్, గవర్నమెంట్ అడ్వకేట్లు సరైన వాదనలు వినిపించకపోవడమే ప్రధాన కారణం అన్నారు ఈ తీర్పుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. వెంటనే ప్రభుత్వం అప్పిలు చేయాలని, విద్యార్థుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేయొద్దని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించని సమక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. పెండింగ్లో ఉన్నటువంటి బకాయిలు 65 00 కోట్లను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేనియెడల ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, నట్వ సుధాకర్, కాటం వెంకటేష్ గౌడ్, శివ, మాలిక్ తదితరులు పాల్గొన్నారు

# గడ్డి అన్నారం లో ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.





**గడ్డి అన్నారం - 6 ఏప్రిల్ (మహాప్రభ)** గడ్డి అన్నారం డివిజన్ లో భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయ ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ నగర్ చౌరస్తా, శ్రీకోదండరాం నగర్ కాలనీ, కమలానగర్ కాలనీ చౌరస్తా, పిడటి కాలనీ, వివేకానంద నగర్ బస్సు స్టాప్, సరస్వతి నగర్, ఉదయ్ నగర్ ప్రాంతాల్లో పార్టీ జెండాను ఎగరవేసి, మిఠాయిలు పంచుతూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జనసంఘ్ నుంచి ప్రారంభమైన సిద్ధాంతపరమైన ప్రయాణం గురించి వివరించారు. అలాగే ఎమర్జెన్సీ కాలంలో జరిగిన సంఘటనలను గుర్తుచేస్తూ, 1980 ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భవించిందని తెలిపారు. పార్టీ తొలి అధ్యక్షుడిగా అటల్ బిహారీ వాజపేయి బాధ్యతలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇక నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి దేశానికి సుపరిపాలన అందించిందని, గత పదేళ్లలో ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించిందని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిన బీజేపీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిలకూరి రామ్ రెడ్డి, మురళి, ఏనుగు శ్రీధర్ రెడ్డి, కసం రామ్ రెడ్డి, శ్రవణ్ గౌడ్, సుజాత, రాజేశ్వరి, సురేందర్ రెడ్డి, వెంకటేష్ చారి, సిరి రెడ్డి, సందీప్, షైక్ ఉమర్, మహేందర్, బద్దం వివేకానంద రెడ్డి, సతీష్ చారి, బాబు చౌదరి, సంధ్య, రత్నం, శ్రీకాంత్, పద్మ, శిరీష, పద్మజ, వివేక్ చారి, దినేష్ చారి, రఘునందన్ జోషి, సిద్దు, శశాంక్, గిరీష్, చింటూ, హరీష్, టీంకు, రాము, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు కళ్ళజోళ్ళ పంపిణీ

### -సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్



**గాంధారి ఏప్రిల్ 6 (మహాప్రభ)** కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో కస్తూరి గాంధీ బాలికల విద్యాలయం హాస్టల్ లో 263 బాలికలకు డాక్టర్ల కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, 21 బాలికలకు కళ్ళజోళ్ళు స్థానిక సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్, చేతుల మీదుగా బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈస్మాత్ అలీ ఆప్టికల్ అధికారి హరీష్ రావు, వైద్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటికి అంతరాయం



**నర్సాపూర్, ఏప్రిల్ 6(మహాప్రభ):** చెక్రియల్ మెయిన్ పైపులైన్‌లో లీకేజీ ఏర్పడటంతో నర్సాపూర్, శివంపేట, వెల్దుర్తి సహా సుమారు 10 మండలాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం సాయంత్రం నుంచి బుధవారం వరకు నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. ఈ సమయంలో జిన్నారం, కౌడిపల్లి, చిలిపిచెడ్ తదితర ప్రాంతాల ప్రజలు స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని సూచించారు. లీకేజీ మరమ్మతులు పూర్తయిన వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

# కొత్తపేట డివిజన్‌లో ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.





**కొత్తపేట డివిజన్ - 6 ఏప్రిల్ (మహాప్రభ)** కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్ర మం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో, బీజేపీ ప్రధాన కార్యదర్శి గట్టు మహేష్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ మరియు డివిజన్ అధ్యక్షుడు రాజేష్ కుమార్ పార్టీ అభివృద్ధి, సిద్ధాంతాలు మరియు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యాలపై ప్రసంగిస్తూ కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచితంగా రాజ్యాంగ ప్రతుల పంపిణీ



**దేవరకొండ ఏప్రిల్ 6( మహాప్రభ )**
సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు, వెల్లంకి సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాసులు రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరులు రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలుగులోకి అనువదించిన రాజ్యాంగ ప్రతులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు. మూసిని ఆంజనేయులు. కాశి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## బిజెపి 46వ జెండా ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు

### -బిజెపి కార్యకర్తలు నాయకులు





**గాంధారి ఏప్రిల్ 6 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లోని బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి మధుసూదన్ రావు మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అయినటువంటి బిజెపి అధిక కార్యకర్తలు కలిగిన పార్టీ బిజెపి పార్టీ అని నాయకులు జెండా ఎగురవేసికార్యకర్తలు పార్టీ సంస్థగా నిర్మాణంతో పార్టీ జెండా సంబరాలు చేసుకున్నారు. ప్రతి ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతంగల్ కిషన్ రావు, మండల మాజీ అధ్యక్షులు సాయిబాబా, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, తిమ్మాపూర్ ఉప సర్పంచ్ సంజీవులు, గాంధారి టౌన్ అధ్యక్షులు గంగి రమేష్, మాలికరావు, శేఖర్, సుధాకర్, మజిరామ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం..

### మెదక్ జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్.



**మెదక్ జిల్లా -06ఏప్రిల్ (మహాప్రభ )**
మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు శ్రీ వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి జెండా ఎగరవేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, మెదక్ జిల్లా బిజెపి సీనియర్ నాయకులు మాజీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ గౌడ్ గారు, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, బీసీ మూర్ఛ జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, యువ మోర్చా అధ్యక్షుడు సతీష్, బిజెపి సర్పంచ్ బెండవీన, బిజెపి మెదక్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, బిజెపి సీనియర్ నాయకులు పబ్బ లక్ష్మణ్ బాబా సాయికుమార్,వడ్ల జనార్ధన్, వేణుగోపాల్ అల్లం మధు, మనోజ్ కుమార్, కృష్ణారెడ్డి, సన్నీ ,రాహుల్ ,బబ్లు ఆఫీస్ సెక్రటరీ సాయికుమార్ తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## మర్రు వారి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి



**దేవరకొండ ( డివిజన్) 06ఏప్రిల్ మహాప్రభ**
చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన మర్రు చంద్రశేఖర్ రావు సంజన గార్ల వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి,తీదేడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోనగంటి గొవర్ధనాచారి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్,కాయితి బచ్చిరెడ్డి,తిరుమణి పాపయ్య,దాసరి తిరుపతయ్య,శివర్ల పర్వతాలు యాదవ్,మాదగోని కృష్ణ గౌడ్,బొడ్డు యాదగిరి,దాసరి ముత్తయ్య,వీరమల్ల జగదీష్,జెల్లా వెంకటేశ్వర్లు, కాయితి భగవాన్ రెడ్డి,రాశిక పాండయ్య,మెరిక శంకరయ్య, ఉడుత శంకరయ్య, మెరిక శంకర్,మెండె రాములు ,టిడిపి నాయకులు జూలురి శ్రీధర్, బిజేపి నాయకులు మోర కిరణ్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**రామాయంపేట ఏప్రిల్ 6 (మహా ప్రభ)**
గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఎంపీ రఘునందన్ రావు సహకారంతో మంజూరైన సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ చిమ్మనమైన శైలజ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థంగా వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై దాడి 12 క్వింటాళ్లు స్వాధీనం

### - నిందితుడిపై కేసు



**కామారెడ్డి, ఏప్రిల్ 6: (మహాప్రభ)**
రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై జిల్లా సీసీఎస్ పోలీసులు దాడి నిర్వహించి సుమారు 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో షేక్ ఆధిల్ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సీసీఎస్ బృందం ఆకస్మిక దాడి చేపట్టి అక్కడ నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిపై కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హెచ్చరిస్తూ... పేదల కోసం ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణా లేదా నిల్వలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## కాన్సర్ కు రక్షణ హెచ్.పి.వి టీకా

### - వైద్యాధికారి అన్వర్





**పాపన్నపేట, ఏప్రిల్ 6 ( మహా ప్రభ )**
9 నుండి 14 సంవత్సరాల బాలికలకు ఉచిత హెచ్.పి.వి టీకాలు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి అన్వర్ తెలిపారు. సోమవారం పాపన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్.పి.వి టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. గర్భశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు ఈ టీకా తోడ్పడుతుందన్నారు. తొలి రోజు 16 మంది బాలికలకు ఈ టీకాలు వేశారు. తహశీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష్ణువర్ధన్,హెల్త్ సిబ్బంది రాజశ్రీ,ఉపసర్పంచ్ సద్దామ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

## భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం

### -పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్



**దేవరకొండ ఏప్రిల్ 6( మహాప్రభ )**
బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం 1,4,8,10,14,15,18,19, వార్డులలో బిజెపి జండా ఎగరవేసే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలు నాయక్ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ వనం పుష్పలత నక్క వెంకటేశ్వర్లు ఒకటో వార్డు కౌన్సిలర్ గుండాల అంజయ్య నేతాల వెంకటేశ్వర్లు సోనగంటి రవి ప్రసాద్ వనం జగదీశ్వర్ ఇడశీరవి వినోద్ చీత్రియాల నాగేంద్ర నీల సుమన్ కాసుల శంకరయ్య చిలక రాజు బిక్కు సముద్రాల సహదేవుడు చండీశ్వర్ రెడ్డి శంకర్ బెల్దే మాధవి అప్పం అజయ్ పున్న వెంకటేశ్వర్లు మునగపాటి చంద్రకళ సబావట్ లక్ష్మి పోలగోని గణేష్ శివ గౌడ్ జూలూరి శ్రీను చిత్రం ఉదయ్ సైదులు తదితరులు పాల్గొన్నారు

## దేవునిపల్లిలో జూదంపై మెరుపుదాడి9 మంది అరెస్ట్

### -- నగదు, వాహనాలు స్వాధీనం



**కామారెడ్డి ఏప్రిల్ 6(మహాప్రభ)**
దేవునిపల్లి పరిధిలో జూదం స్థావరంపై పోలీసులు మెరుపుదాడి నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.26,770 నగదు, 9 మొబైల్ ఫోన్లు, 6 స్కూటీలు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు దేవునిపల్లి పోలీసులు, ప్రత్యేక బృందం సంయుక్తంగా కల్కి నగర్ కాలనీలో తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో జూదం ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం, పేకాట, బెట్టింగ్‌ల వంటి అసాంఘిక కార్యకలాపాలు కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీయడమే కాకుండా సామాజిక సమస్యలకు దారితీస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండి కష్టపడి ఎదగాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, ఎక్కడైనా ఇలాంటి చర్యలు గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## తారక హోటల్‌లో అగ్నిప్రమాదం

**కరీంనగర్, -06ఏప్రిల్ (మహాప్రభ )**
కరీంనగర్ నగరంలోని ప్రధాన బస్టాండ్ సమీపంలో ఉన్న తారక హోటల్‌లో ఆదివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి, భారీగా పొగలు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.అప్రమత్తమైన ప్రజలు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.ప్రాణనష్టంపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## కుల దూషణ కేసులో జైలు శిక్ష
### నిందితుడికి ఏడాది కారాగారం, జరిమానా విధింపు



**కామారెడ్డి, ఏప్రిల్ 6: (మహాప్రభ)** కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన నిందితుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. బాధితుడికి న్యాయం జరిగేలా పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తుతో ఈ తీర్పు వెలువడింది.రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామానికి చెందిన కొత్తోల్ల అనిల్ (20) 2021 జనవరి 26న రాత్రి గ్రామంలోని చిన్న హాస్టల్ సమీపంలో స్నేహితులతో కూర్చొని మాట్లాడుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన ఎండి రఫీ బైక్‌పై అక్కడికి వచ్చాడు. గ్రామ సర్పంచ్ ఫోన్ నెంబర్ అడిగి, అది తప్పుగా డయల్ చేసిన నేపథ్యంలో ఆగ్రహంతో అనిల్‌ను కులం పేరుతో దూషిస్తూ అసభ్య పదజాలంతో తిట్టడమే కాకుండా శారీరకంగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అనిల్ జనవరి 30న రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం నిజామాబాద్‌లోని II అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి (ఎస్‌సి, ఎస్‌టి కోర్టు) టి. శ్రీనివాస్ నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.2,700 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన రామారెడ్డి పోలీసులను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, అభినందించారు. అలాగే కేసులో వాదనలు వినిపించిన పీపీ ఆర్. దయాకర్ గౌడ్, దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బందిని ప్రశంసించారు.

## చిట్యాల, సోమారం వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**తాడ్వాయి ఏప్రిల్ 6(మహాప్రభ)** తాడ్వాయి మండలం చిట్యాల, సోమారం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు మద్దతు ధరతో సకాలంలో కొనుగోళ్లు జరిపేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, మండల సమాఖ్య ఏపీఎం, సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## నిజాయితీ చాటుచెప్పిన ఆర్టీసీ డ్రైవర్
**అభినందించిన డిపో అసిస్టెంట్ మేనేజర్**



**దేవరకొండ ఏప్రిల్ 6 ( మహాప్రభ )** దేవరకొండ ఆర్టీసీ డిపో ఉద్యోగులు తమ విధుల పట్ల నిజాయితీ చాటుకున్నారు. దేవరకొండ నుంచి బయలుదేరిన నడిగడ్డ మ్యారేజ్ స్పెషల్ బస్సులో ఓ ప్రయాణికుడు రూ.50,000 విలువైన లాప్ టాప్ తో కూడిన బ్యాగును బస్సులో మర్చిపోయి నడిగడ్డ లో దిగిపోయినాడు .డ్రైవర్ . YADAIAH.E.176102గమనించి భద్రపరిచి డిపో అధికారులకు తెలియజేశారు. విచారణ జరిపి దేవరకొండ డిపో లో బాధిత ప్రయాణికునికి లిలాప్ టాప్ తో కూడిన బ్యాగును అందజేశారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు విధుల పట్ల నిజాయితీ చాటినందుకు అభినందనలు తెలిపారు.

## కుక్క కాటుకు రెండేళ్ల పిల్లోడు తీవ్ర గాయాలు





**గాంధారి ఏప్రిల్ 6 (మహాప్రభ)** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నేరల్ తండాలో స్థానికుల వివరాల ప్రకారం బాలుడి తల్లి జెమినీ భాయ్, తండ్రి బాల్ సింగ్, వీళ్లకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇంటి ముందుఆడుకుంటున్న పిల్లోడు పై కుక్క విరుచుకు పడ్డది. పిల్లోడికి తీవ్ర గాయాలతో గాంధారి ఆసుపత్రికి తరలి వస్తే వారు కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నారు.

# వడ్డెర్లను వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలి
### దేవరకొండ వడ్డెర సంఘం డిమాండ్



**దేవరకొండ ( డివిజన్) 06 ఏప్రిల్ మహాప్రభ** వడ్డెర కులస్తుల చిరకాల కోరికైన ఎస్టీ (ఞు) హోదా కల్పించడంలో ప్రభుత్వం ఇకపై జాప్యం చేస్తే సహించేది లేదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ హెచ్చరించారు. సోమవారం దేవరకొండలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వడ్డెర కులస్తుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని, వారిని తక్షణమే ఎస్టీ జాబితాలో చేర్చాలి. ఇది వడ్డెర్ల న్యాయమైన హక్కు.ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక వడ్డెర కార్పొరేషన్‌ను ప్రకటించాలి. దీని ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రుణాలు, సబ్సిడీలు అందించి ఆదుకోవాలి.కులవృత్తిపై ఆధారపడి బతుకుతున్న వడ్డెర్లకు స్వయం ఉపాధి పథకాలు, చిన్న వ్యాపారాల కోసం ఆర్థిక చేయూతనివ్వాలి. నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేయాలి.ఈ సందర్భంగా ఇరగ దిండ్ల కృష్ణ మాట్లాడుతూ, అభివృద్ధి ఫలాలు అందక వడ్డెర సమాజం తీవ్ర అన్యాయానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "కష్టపడి పని చేసే వడ్డెర్లకు నేటికీ సరైన గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం లేవు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తేనే నిరుపేద కుటుంబాలకు సబ్సిడీ రుణాలు అందుతాయి. ప్రభుత్వం మా డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే వడ్డెర సమాజం ఐక్యంగా పోరాడుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు మరియు కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంఎస్ఎన్ ఫార్మా & సైగా టెక్నాలజీస్ కంపెనీల జాబ్ మేళా





**కామారెడ్డి ఏప్రిల్ 6 (మహాప్రభ)** సోమవారం రోజున కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎన్ ఫార్మా మరియు ంవఅస్త్రష్ఘు టెక్నాలజీస్ హైదరాబాద్ కంపెనీలు జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని మరియు ఇట్టి జాబ్ మేళా కు అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు.వారికి రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ నిర్వహించి సుమారుగా 50 మంది అభ్యర్థులు ఎం.ఎస్.ఎన్ ఫార్మా కంపెనీకి ఎంపిక కావడం జరిగిందని మరియు ఐటిఐ కంపెనీకి అభ్యర్థులు నలుగురు హైదరాబాద్ కి ఎంపిక కావడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ జయ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలీం,ఖ అసోసియేషన్ ఉత్తర తెలంగాణ జోన్ సెక్రెటరీ శ్రీకాంత్, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్ ఫార్మా హెచ్.ఆర్, సీతారాం, శిరీష, రవి మరియు కళాశాల సిబ్బంది సంతోష్ రెడ్డి, సాయినాథ్, ప్రవీణ ,యోగిత, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం, ఎంపిక చేయబడిన అభ్యర్థులకు ఉద్యోగ శిక్షణతో పాటు ౦×ూూ వారి సౌజన్యంతో డిగ్రీ విద్యను అందిస్తామని తెలియజేశారు. మరియు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని తెలియజేశారు. అంతేకాకుండా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఉత్తర తెలంగాణ జోన్ సెక్రటరీ చెల్లాపురం శ్రీకాంత్ ఎంపీసీ చదివి జూూ్రాజజు లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచిత ఇంజనీరింగ్ విద్యా హాస్టల్ వసతి కల్పిస్తామని మరియు భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు ప్రభుత్వ జూనియర్ కళాశాల కామారెడ్డి లో నిర్వహిస్తామని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తు కార్యక్రమాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసి అనేకమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి తమ కళాశాల ముందంజలో ఉంటుందని మరియు విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి స్కిల్స్ స్పోకెన్ ఇంగ్లీష్ పైన శిక్షణ ఇస్తామని డిజిటల్ బోధన చే స్తామని తెలియజేశారు జిల్లా నోడల్ అధికారి సలాం ధన్యవాదాలు తెలియజేస్తూ అభ్యర్థులు మంచి నైపుణ్యాలను నేర్చుకోవాలని ఉద్యోగాలు సంపాదించాలని వారికి స్ఫూర్తి నింపారు.

## బాన్సువాడ ఆసుపత్రి కి రాష్ట్ర పురస్కారం.



**కామారెడ్డి ఏప్రిల్ 6 (మహాప్రభ)** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ చూపిన ఆరోగ్య శాఖ సిబ్బందిని, మరియు ఆసుపత్రులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.ప్రభుత్వ ఆసుపత్రి లో ఎక్కువ కాన్పులు నిర్వహించిన బాన్సువాడ ఆసుపత్రి ఉత్తమ ఆసుపత్రి గా ఎంపికైంది. రవీంద్ర భారతి లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రేపు రాష్ట్ర వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర రాజ నరసింహ, చేతులమీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు ఙజనూ డా. విజయ భాస్కర్ అవార్డు అందుకోనున్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్ కుమార్ ద్వారా ఇట్టి సమాచారాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు ఙజనూ డా.విజయ భాస్కర్ అందుకున్నారు.

**అవార్డు బాధ్యతను పెంచింది:** డా. విజయ భాస్కర్. బాన్సువాడ ఆసుపత్రి కి రావడం చాలా సంతోషకరమని డా. విజయ భాస్కర్ తెలిపారు.ఆసుపత్రి లో పని చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి కి ఈ అవార్డు అంకితమిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. ఆసుపత్రి పురోభవృదిలో అనునిత్యం తమ వెంట ఉండే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి,కలెక్టర్, ఆశిష్ సంగ్వాన్ కి, సబ్ కలెక్టర్. కిరణ్మయికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినారు.

## అకాల వర్షాలతో పంటలకు నష్టం
### 339 ఎకరాల్లో దెబ్బతిన్న వరి, మక్క, జొన్న పంటలు





**తాడ్వాయి, ఏప్రిల్ 6: (మహాప్రభ)** మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. చిట్యాల మండలంలోని ధెమికాలన్, ఎర్రపహాడ్ గ్రామాల్లో నష్టపోయిన పొలాలను అధికారులు సోమవారం పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్. నర్సింలు, తహసీల్దార్, ఎంఆర్ఐ, గ్రామ సర్పంచ్‌లు, ఏఈఓలు, రైతులు కలిసి పంట పొలాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం వరి, మక్కజొన్న, జొన్న పంటలకు భారీ నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. మండలవ్యాప్తంగా సుమారు 339 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, 464 మంది రైతులు ప్రభావితమైనట్లు అధికారులు తెలిపారు. పై అధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే రైతు వారీగా పూర్తి స్థాయి సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## హుక్కా సెంటర్ పై పోలీసులు దాడి..

**వనస్థలిపురం, ఏప్రిల్ 6: (మహాప్రభ)** వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని సుబ్బయ్య గారి హోటల్ ప్రక్కన Chillax cafe, ఆగమయ్య నగర్ లో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, చట్ట విరుద్ధంగా హుక్కా సెంటర్ నడుపుతున్నారని సమాచారం రవడంతో వనస్థలిపురం పోలీసుల ఆధ్వర్యంలో హుక్కా సెంటర్ పై రైడ్ చేశారు.హుక్కా త్రాగుతున్న వారిని, కేఫ్ ఓనర్ ని అదుపులో తీసుకొన్నాము మరియు హుక్కా సెంటర్ నందు ఉన్న వస్తువులను సిజ్ చేయడం జరిగింది, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# బిజినెస్

## నష్టాల్లో ప్రారంభమై లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..
## 787 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



భారత స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ నష్టాల్లో ప్రారంభమైనప్పటికీ, మధ్యాహ్నం నుంచి లాభాలబాటపట్టాయి. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 787 పాయింట్ల లాభంతో ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 73,477.53 పాయింట్ల వద్ద స్వల్ప నష్టంతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో మరింత నష్టపోయి 72,728.66 పాయింట్ల కనిష్ట స్థాయికి చేరిందిఇదే సమయంలో ఇరాన్-అమెరికా మధ్య కాల్పులు విరమణ అంశంలో ప్రకటన వెలువడటం మార్కెట్ వర్గాలకు కలిసొచ్చింది. మార్కెట్ లాభాలబాట పట్టింది. ఒక దశలో సెన్సెక్స్ 74,207.46 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు 787.30 పాయింట్ల (1.07 శాతం) లాభంతో 74,106.85 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 255.15 పాయింట్ల (1.12 శాతం) లాభంతో 22,968.25 పాయింట్ల వద్ద ముగిసింది. లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సందప ఒక్క రోజే ఏకంగా రూ.5 లక్షల కోట్లు పెరిగింది. దీంతో భారతీయ మార్కెట్ల విలువ రూ.427 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ రోజు కన్స్యూమర్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ షేర్లు దూసుకెళ్లగా, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ షేర్లు మాత్రం భారీగా నష్టపోయాయి. ఇక, డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా బలపడి 93.05గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 108 డాలర్లకు చేరింది. అలాగే, బంగారం ఔన్స్ 4689 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ రోజు సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్ టీ, అల్ట్రా టెక్ సిమెంట్, టైటాన్ సంస్థలు లాభాల్లో ముగిశాయి. మార్కెట్ పుంజుకోవడానికి ప్రధాన కారణం.. ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ ప్రతిపాదనలో ముందడుగు పడటమే. ఇరు దేశాలకు చెందిన ప్రతిపాదనలు రెండు వైపులా చేరాయి. ఈ పరిణామంతో క్రూడాయిల్ ధర తగ్గింది. రూపాయి విలువ బలపడింది.

### మరోసారి కుప్పకూలిన
## బంగారం ధరలు..
### ఒక్కసారిగా భారీగా డౌన్.. లేటెస్ట్ రేట్లు ఇవే..



బంగారం కొనుగోలు చేసేవారికి భారీ గుడ్ న్యూస్. ధరలు తారుమారు అయ్యాయి. ఒక్కసారిగా ధరలు మారిపోయాయి. సోమవారం గోల్డ్, సిల్వర్ రేట్లు భారీగా కుప్పకూలాయి. అంతర్జాతీయ పరిణామాల క్రమంలో పసిడి ధరలు పతనమయ్యాయి. రెండు రోజులుగా ధరలు పెరుగుతుండగా.. ఇప్పుడు వాటికి బ్రేక్ పడింది. దీంతో కొనుగోలుదారులు ఊరట చెందుతున్నారు. సోమవారం వివిధ నగరాల్లో రేట్లు ఎలా ఉన్నాయో చూద్దాం.హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,130 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,50,930 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే ఇవాళ రూ.1800 తగ్గింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,36,700 వద్ద ట్రేడవుతుండగా.. నిన్న రూ.1,38,350 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.1650 తగ్గుముఖం పట్టింది.విజయవాడ, విశాఖపట్నంలో కూడా అవే ధరలు ఉన్నాయి. ఇక చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,170గా ఉండగా.. నిన్న రూ.1,52,180 వద్ద కొనసాగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,490 వద్ద ట్రేడవుతోంది. నిన్న ఆ ధర రూ.1,39,500గా ఉంది. ఇక బెంగళూరులో కూడా గోల్డ్ రేట్లు పడిపోయాయి.బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,49,130గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,36,700 వద్ద ట్రేడవుతోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ రేటు రూ.1,49,280గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,36,850 వద్ద ఉన్నాయి.ఇక ఢిల్లీలో కిలో వెండి రూ.2.50 లక్షలుగా ఉంది. ఇక చెన్నైలో రూ.2,54,900 వద్ద ట్రేడవుతున్నాయి. ఇక బెంగళూరులో రూ.2.50 లక్షల వద్ద కొనసాగుతున్నాయి. అటు హైదరాబాద్‌లో కేజీ సిల్వర్ రూ.2.55 లక్షల వద్ద కొనసాగుతున్నాయి.

## భారత వృద్ధి అంచనాలకు కోత

**-6.9 శాతం దిగువనే ఉండొచ్చు**
**-ఐసిఐసిఐ బ్యాంక్ రిపోర్ట్**

**ముంబయి**
ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన వనరుల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలతో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి తగ్గొచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో భారత జిడిపిని గతంలో అంచనా వేసిన 7.2 శాతం నుండి 6.8-6.9 శాతానికి తగ్గిస్తున్నట్లు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసులో తలెత్తిన అవరోధాలు దేశీయ ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది.
ముఖ్యంగా పారిశ్రామిక రంగానికి అవసరమైన ఇంధన సరఫరాపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. "పారిశ్రామిక ఇంధన సరఫరాపై ఆంక్షలు ఉన్నందున, గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల ఎరువులు, సిరామిక్స్, లోహాలు, గాజు వంటి రంగాల ఉత్పత్తి ప్రభావితమయ్యే అవకాశం ఉంది" అని ఐసిఐసిఐ బ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది. గతంలో 2022లో ఇంధన ధరలు పెరిగినప్పుడు తయారీ రంగం ఏ విధంగా మందగించిందో గుర్తు చేసింది. ప్రస్తుతం మార్చి నెల తయారీ పిఎంఐ 53.9కి పడిపోవడం తక్షణ ప్రభావానికి నిదర్శనమని పేర్కొంది.
విదేశీ వాణిజ్యం, చమురు ధరల ప్రభావంపై ఐసిఐసిఐ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల వద్ద కొనసాగడం వృద్ధికి ప్రతికూలమని తెలిపింది. చమురు ధరలు 111 డాలర్ల వద్ద ఉన్నప్పుడు (2012-14) వాస్తవ జిడిపి 5.7 శాతానికి పడిపోయిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రస్తుతం సరఫరా పరిమితులు హార్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఎగుమతులు దెబ్బతినడం వంటి అంశాలు 2025-26లోని నాలుగో త్రైమాసికం, 2026-27లో మొదటి త్రైమాసికంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఐసిఐసిఐ బ్యాంక్ తన నివేదికలో వెల్లడించింది. ఎగుమతుల్లో 15 శాతం వాటా ఉన్న గల్ఫ్ దేశాలకు రవాణా నిలిచిపోవడం కూడా ఈ వృద్ధి కోతకు మరో ప్రధాన కారణమని తెలిపింది.

# స్పోర్ట్స్

## ఐపీఎల్‌కు శ్రీలంక బౌలర్లు సిద్ధమేనా..
## ఫిట్‌నెస్ టెస్టు ఎప్పుడు..?



పంతొమ్మిదో సీజన్ మొదలై వారం దాటినా కొందరు ప్రధాన బౌలర్లు మాత్రం ఇంకా భారత్‌కు చేరుకోలేదు. వేలంలో భారీ ధర పలికిన మథీశ పథిరన, మిస్టరీ స్పిన్నర్ వనిందు హసరంగల ఆగమనంపై కూడా స్పష్టత లేదు. శ్రీలంక క్రికెట్ కొత్త నిబంధనల ప్రకారం వీరిద్దరూ ఫిట్‌నెస్ టెస్టు పాసైతేనే ఐపీఎల్ ఆడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వీరిద్దరు ఎప్పుడు ఫిట్‌నెస్ టెస్టుకు హాజరవుతారు? తమ ఫ్రాంచైజీతో ఎప్పుడు కలుస్తారు? అనేది అభిమానుల్లో ఆందోళనకు కారణమవుతోంది.ప్రధాన పేసర్ల కొరతతో అల్లాడుతున్న కోల్‌కతా నైట్ రైడర్స్ పథిరన రాక కోసం ఎదురుచూస్తోంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ సైతం మ్యాచ్ విన్నరైన హసరంగ ఎప్పుడొస్తాడా? అని ఆశగా ఉంది. అయితే.. ఈ మధ్యే ముగిసిన పొట్టి ప్రపంచకప్‌లో గాయపడిన యార్కర్ కింగ్ మథీశ పథిరన, వనిందు హసరంగ కోలుకుంటున్నారు. వీరు ఇంకా ఫిట్‌నెస్ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంది.అయితే.. ఐపీఎల్ ఆడేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం హసరంగ ఇంకా లంక బోర్డుకు దరఖాస్తు చేసుకోలేదు. పథిరన మాత్రం నెట్స్‌లో బౌలింగ్ సాధన చేస్తున్నాడు. అతడు ఫిట్‌నెస్ టెస్టు పాసై.. ఏప్రిల్ మూడో వారంలో ఐపీఎల్ కోసం భారత్‌కు వచ్చే అవకాశాలున్నాయి. లంక బోర్డు కొత్తగా తీసుకొచ్చిన ఫిట్‌నెస్ నిబంధనలపై క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతివ్వాలని ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నువాన్ తుషార ఏకంగా కోర్టునే ఆశ్రయించిన విషయం తెలిసిందే.

### ప్రపంచ రికార్డును కోల్పోయిన
## టిమ్ డేవిడ్..!



ఆర్సీబీ విధ్వంసకర ప్లేయర్ టిమ్ డేవిడ్ సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో అదరగొట్టాడు. కేవలం 25 బంతుల్లోనే 70 రన్స్ చేసి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. టిమ్ విధ్వంసంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో సీఎస్‌కే 19.4 ఓవర్లలో 207 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆర్సీబీ 43 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే టిమ్ డేవిడ్ ఒక్క పరుగు తేడాతో ప్రపంచ రికార్డును కోల్పోయాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో 15వ ఓవర్ తరువాత బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడి రికార్డు డానియల్స్ సామ్స్ పేరిట ఉంది. అతడు 2022లో ససెక్స్‌పై 71 పరుగులు చేశాడు. తాజాగా టిమ్ డేవిడ్ 70 పరుగులు చేశాడు. అద్భుత ప్రదర్శన చేసినందుకు గానూ టిమ్ డేవిడ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. అవార్డును తీసుకున్న తరువాత అతడు మాట్లాడుతూ.. రజత్ పాటిదార్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. నిజం చెప్పాలంటే ప్రస్తుతం నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. ఇలా ప్రతి రోజు జరగదు. ఇక కెప్టెన్ రజత్ పాటిదార్ అద్భుతంగా ఆడుతున్నాడు. అతడు ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నాడని డేవిడ్ అన్నాడు. ఇక తాను వివిధ స్థానాల్లో బ్యాటింగ్ చేయడం గురించి మాట్లాడుతూ.. తాను అదృష్టవంతుడినని చెప్పుకొచ్చాడు. తన ఆటను ఎక్కువగా మార్చకుండా ఆడేస్తున్నానని అన్నాడు. ఎక్కువ సేపు బ్యాటింగ్ చేసేందుకు అవకాశం ఉంది. సహచరులు, మేనేజ్‌మెంట్ నుంచి అద్భుతమైన మద్దతు ఉందన్నాడు.

## ఆసియా ఛాంపియన్‌షిప్స్ నుంచి వైదొలిగిన సాత్విక్ - చిరాగ్ జోడీ.. ఆ ఇద్దరిపైనే ఆశలన్నీ..!



భారత స్టార్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి మరో మెగా టోర్నీ నుంచి వైదొలిగారు. ఇప్పటికే గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్ ముందే నిష్క్రమించిన ఈ జోడీ ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ లో ఆడడం లేదు. సాత్విక్ భుజం గాయంతో బాధ పడుతున్నందున టోర్నీ నుంచి వైదొలగుతున్నట్టు పీటీఐ వార్తా సంస్థతో కోచ్ టాన్ కిమ్ హెర్ వెల్లడించాడు.ఆ ఏడాది సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టిలకు కలిసి రావడం లేదు. ఈ మధ్య కాలంలో వీరిద్దరు ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్నారు. గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో ఆడలేకపోయిన భారత జోడీ.. మరోసారి గాయం వల్లనే బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆడడం లేదు. 2023లో విజేతగా నిలిచిన సాత్విక్ -- చిరాగ్ జంట నిష్క్రమణతో లక్ష్య సేన్, పీవీ సింధులపైనే పతకం ఆశలు పెట్టుకుంది భారత్ పురుషుల సింగిల్స్‌లో సేన్, మహిళల సింగిల్స్‌లో సింధులు సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. భుజం గాయం నుంచి కోలుకుంటున్న హెచ్‌హెస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్‌లు బరిలో దిగుతున్నా ఇటీవలి ఫామ్ దృష్ట్యా పతకం ఖాయమని చెప్పలేం. బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో దినేశ్ ఖన్నా 1965 పురుషుల సింగిల్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందాడు.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?




మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## బ్లాక్ శారీలో పిచ్చెక్కిస్తున్న నభా

# 15 ఏళ్ల వయస్సులోనే డీప్‌ఫేక్ దెబ్బ...

## జాన్వీ కపూర్ భావోద్వేగ వ్యాఖ్యలు



అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతోంది. బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూనే, తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు 'పెద్ది' సినిమాతో సిద్ధమవుతోంది. అయితే తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న జాన్వీ తన జీవితంలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని వెల్లడించి అందరినీ ఆలోచనలో పడేసింది.జాన్వీ కపూర్ మాట్లాడుతూ, తాను కేవలం 15 ఏళ్ల వయసులోనే డీప్‌ఫేక్ టెక్నాలజీ కారణంగా ఒక విచిత్రమైన ఘటనను ఎదుర్కొన్నానని తెలిపింది. “అప్పుడు నేను స్కూల్‌లో చదువుకుంటున్నాను. ఒక రోజు నా ఫ్రెండ్ ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో నా ఫోటో ఉందని చెప్పాడు. అది నిజానికి నా ఫోటో కాదు... డీప్‌ఫేక్ ద్వారా తయారు చేసిన ఫోటో” అని ఆమె చెప్పుకొచ్చింది. ఈ సంఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని జాన్వీ వెల్లడించింది. “ఆ ఫోటో గురించి తెలిసినప్పుడు నేను చాలా షాక్‌కు గురయ్యాను. ఏమి చేయాలో అర్థం కాలేదు. ఆ సమయంలో నేను చాలా బాధపడ్డాను. అదే సమయంలో సోషల్ మీడియా లో నైతికత ఎంత తక్కువగా ఉందో నాకు అర్థమైంది” అని ఆమె తెలిపింది. అప్పుడే నేను గ్రహించాను... భవిష్యత్తులో కూడా ఇలాంటి విషయాలు ఎదురవుతాయని. అందుకే ఇప్పుడు ఇలాంటి డీప్‌ఫేక్ ఫోటోలు వచ్చినా వాటిని ఎక్కువగా పట్టించుకోను అని జాన్వీ కపూర్ స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో టెక్నాలజీ దుర్వినియోగం ఎలా వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేస్తుందో ఈ ఘటన మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, సెలబ్రిటీలే కాక సాధారణ ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, జాన్వీ కపూర్ ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉంది. తెలుగు చిత్రం 'పెద్ది'తో పాటు బాలీవుడ్‌లో కూడా వరుస ప్రాజెక్టులతో ఆమె కెరీర్ పీక్‌లో కొనసాగుతోంది.



# ప్రయోగాత్మక పాత్రలంటే ఇష్టం

'ఇందులో నేను చేసిన సరస్వతి పాత్ర చాలా డిఫికల్ట్. ఓ యాక్టర్‌కి ఛాలెంజింగ్ రోల్స్ చేయడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. మేకర్స్ కూడా ఆ పాత్రను సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. అందుకే ఎంజాయ్ చేస్తూ నటించా. ఇప్పటివరకూ నేను చేయని జానర్ ఇది. ఇందులో స్టంట్స్ చేశాను. చేజింగులు చేశాను. ఫిజికల్‌గా చాలా కష్టపడ్డా. తెరపై అందరికీ నచ్చుతాననే అనుకుంటున్నా' అని మృణాళ్ ఠాకూర్ అన్నారు. అడివి శేష్‌కు జోడీగా ఆమె నటించిన పానిండియా యాక్షన్ రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం మృణాళ్ విలేకరులతో ముచ్చటించింది.ఒక నటిగా ప్రయోగాత్మక పాత్రల్లో నటించడమంటే నాకిష్టం. అలాగే నాకు నేనే సర్‌ప్రైజ్ అవ్వడం ఇష్టం. అలాంటి అవకాశం ఈ పాత్ర ద్వారా వచ్చింది. ఈ కథ విన్నప్పుడు హరి(అడివి శేష్), సరస్వతి(మృణాళ్) ఎందుకు డెకాయిట్స్‌గా మారారు? అనేది చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఒక డిఫరెంట్ లవ్‌స్టోరీ ఇది. ముఖ్యంగా అడివి శేష్ కోసం అంతా థియేటర్లకు వచ్చి ఈ సినిమా చూడాలని కోరుతున్నా. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. అద్భుతంగా నటించారు. అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. తెలుగుతోపాటు హిందీలోనూ ఈ సినిమాను షూట్ చేశాం. ఏ భాషవారికైనా నచ్చే సినిమా ఇది. ప్రకాశ్‌రాజ్, అనురాగ్ కశ్యప్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. ఇక దర్శకుడు షానియల్ దగ్గర్నుంచీ సాంకేతికంగా అందరూ అద్భుతంగా పనిచేశారు. కచ్చితంగా 'డెకాయిట్' అందరికీ నచ్చుతాడు' అన్నారు మృణాళ్‌ఠాకూర్.

# హీరోయిన్‌ను ఫైనల్ చేసిన అనిల్ రావిపూడి..



ఈ ఏడాది చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన మన శంకర వరప్రసాద్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఈ మూవీ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న అనిల్ రావిపూడి 2027 సంక్రాంతికి విక్టరీ వెంకటేశ్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబోను సెట్ చేశాడని తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్లుగా ఎవరెవరు కనిపిస్తారనే దానిపై పలు వార్తలు ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చేశాడు అనిల్ రావిపూడి.ప్రదీప్ రంగనాథన్ నటించిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వన్ ఆఫ్ ది గెస్ట్‌గా హాజరయ్యాడు అనిల్ రావిపూడి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన నెక్ట్స్ సినిమాలో కృతిశెట్టి వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్టు తెలిపాడు. కృతిశెట్టి నందమూరి కళ్యాణ్ రామ్‌కు జోడీగా కనిపించబోతుందట. మరి వెంకటేశ్‌తో రొమాన్స్ చేయబోయేది ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. షైన్ స్క్రీన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సంక్రాంతి ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఇంతకీ ఈ ప్రాజెక్టు కోసం అనిల్ రావిపూడి ఎలాంటి కథను సిద్ధం చేశాడు. రెండో హీరోయిన్ ఎవరై ఉంటుందనే దానిపై ఏదైనా క్లారిటీ ఇస్తాడేమో చూడాలి.

# లవ్ ఇన్సూరెన్స్ ప్రేక్షకులకు నచ్చుతుంది: దిల్ రాజు



'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అంటూ ప్రేక్షకులను కొత్త కాన్సెప్ట్ మూవీతో అలరించేందుకు సిద్ధమయ్యారు ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి. వీరిద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. నయనతార, ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించారు. ఈనెల 10న రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు దిల్ రాజు, అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ టుడే' ప్రేక్షకులకు నచ్చుతుందని ముందే ఊహించినట్లు తెలిపారు. అందుకే తెలుగులో డబ్ చేయించినట్లు చెప్పారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com